క్లుప్తంగా

'కుట్టు శిక్షణ స్కామ్ నిగ్గు తేల్చాలి'



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మధురవాడ: కూటమి ప్రభుత్వం మహిళలకు కుట్టు శిక్షణ పేరుతో భారీ స్కాంకు తెరతీసిందని, ఈ అవినీతిపై విచారణ జరిపించాలని ఏపీ నగరాలు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం మధురవాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ మహిళలను ప్రభుత్వం మోసం చేసిందని, కుట్టు శిక్షణ, మిషన్ల పంపిణీలో రూ.154 కోట్లకు పైగా అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ శిక్షణ సంస్థలను కాదని, కూటమి నాయకులకు అనుకూలమైన వ్యక్తులకు టెండర్లు కట్టబెట్టారని విమర్శించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో మహిళలకు అందించిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం నిలిపివేసి, ఇసుక, మట్టి, మద్యం, భూ కేటాయింపుల్లో అవినీతికి పాల్పడుతోందని ఆయన ఆరోపించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పీఎం పాలెం: రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలైన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మాది ఎస్ఆర్ కాలనీ బ్లాక్ నంబర్ 19లో నివసిస్తున్న గెంజేటి సూర్య కుమారి (48) నగరంలోని ఓ ఆస్పత్రిలో పని చేస్తోంది. ఆమె శుక్రవారం ఉదయం 8 గంటలకు విధులకు హాజరైంది. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటికి బయలుదేరింది. ఈ క్రమంలో చంద్రంపాలెం బస్టాప్ వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయిన ఆమె తలకు తీవ్ర గాయమైంది. వెంటనే గాయత్రి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుమారుడు బుచ్చిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

18న మెగా జాబ్ మేళా

కొమ్మాది: 8వ వార్డు ఎండాడలో గల యాక్ట్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ బి. రాజారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్‌లో 20 కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగులు అర్హులన్నారు.

వైద్యం వికటించడంతో మహిళ పరిస్థితి విషమం



రేవతి (ఫైల్)

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యర్రంశెట్టి రేవతి అనే వివాహిత వైద్యం వికటించడంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కొవ్వూరుకు చెందిన రేవతి భర్త జనార్దన్‌తో కలిసి తగరపువలసలో నివాసం ఉంటున్నారు. భార్య వాష్ రూమ్‌లో జారిపడటంతో చేయి విరిగింది. శస్త్రచికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చగా, వైద్యం చేస్తుండగా ఆమె స్పృహ కోల్పోయింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొందని భర్త జనార్దన్ ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులు తన భార్య బతికే అవకాశాలు తక్కువగా ఉన్నాయని చెప్పారని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. భీమిలి పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

కార్మిక పక్షపాతి గున్నారావు



గున్నారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులు, అసంఘటిత రంగ కార్మికుల తరపున తెడ్లాపు గున్నారావు ఎన్నో పోరాటాలు చేశారని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కొనియాడారు. శనివారం ఆయన నాలుగో వర్ధంతి సందర్భంగా గుజ్జు రామునాయుడు భవనంలో గున్నారావు చిత్రపటానికి నివాళులర్పించారు. చిట్టివలస లేబర్ యూనియన్‌లో పనిచేసిన గున్నారావు తరువాతి తరం నాయకులకు ఆదర్శంగా పనిచేశారన్నారు. ఆయన లేని లోటు పార్టీకి పూడ్చలేనిదన్నారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, అప్పలసూరి, నూలు ఆదినారాయణ, లక్ష్మణరావు, సన్నిబాబు, సత్యారావు, రామారావు, గోవింద్, తవుడుబాబు, ఎన్. లక్ష్మణరావు పాల్గొన్నారు.

పల్లెగూటికి పండగొచ్చింది



పాండ్రంగిలోని జట్లమ్మ ఆలయ ముఖ ద్వారం



పాండ్రంగిలోని జట్లమ్మ ఆలయం





రెడ్డిపల్లిలో ముస్తాబైన బంగారమ్మ ఆలయం

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పండగ వేళ రానే వచ్చింది. పట్నం హడావుడికి దూరంగా, ప్రశాంతంగా ఉండే పల్లెటూళ్లు సంబరాల సందడితో కళకళలాడుతున్నాయి. ఊరి వాళ్లంతా ఒకచోట చేరి, తమ ఆచారాలు, సంప్రదాయాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు. పల్లెగూటికి పండగొచ్చింది... ఇది కేవలం ఒక వేడుక కాదు, తరతరాల బంధాన్ని మరింత బలపరిచే ఒక గొప్ప సందర్భం. -పద్మనాభం

16 పల్లెల్లో పండగ సందడి

12 నుంచి ఉత్సవాలు ఆరంభం

రెడ్డిపల్లి, పాండ్రంగి, శేరిఖండం పంచాయతీల్లో ఊరి పండగలు

మండలంలోని మూడు పంచాయతీల పరిధిలోని 16 గ్రామాల్లో పండగ సందడి నెలకొంది. ఆరేళ్ల తర్వాత వస్తున్న ఈ పండగకు గ్రామస్తులు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇళ్లన్నీ పండగ శోభతో కళకళలాడుతున్నాయి. ఈ నెల 12, 13 తేదీల్లో ఉత్సవాలు జరగనున్నాయి. పాండ్రంగి, రెడ్డిపల్లి, శేరిఖండం పంచాయతీల్లో 2019లో చివరిసారిగా ఊరి పండగ జరిగింది. మళ్లీ ఇప్పుడు ఈ వేడుకను నిర్వహిస్తున్నారు. పాండ్రంగితో పాటు బర్లపేట, కురపల్లి, ఏనుగులపాలెం, పాత సామయ్యవలస, కొత్త సామయ్యవలస, మునివాని పాలెం గ్రామస్తులు తమ ఇలవేల్పు జట్లమ్మ పండగను జరుపుకుంటారు. పాండ్రంగిలో 12న తొలేళ్ల ఉత్సవం జరుగుతుంది. ఇందులో భాగంగా అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగిస్తారు. 13న సాయంత్రం విజయనగరం తరహాలో సిరిమాను పండగ నిర్వహిస్తారు. 36 అడుగుల సిరిమానును ఆర్.ఎస్.దేముడు బాబు ఇంటి నుంచి కలిగర్ల వెంకటరావు ఇంటి వరకు మూడుసార్లు తిప్పుతారు. ముందుగా అంజలి రథం, తర్వాత సిరిమాను రథం కదులుతాయి. సిరిమానుపై పూజారి పాండ్రంగి నాగరాజు ఆశీనులవుతారు. సిరిమాను రథం వెనుక మైలపల్లి, బూర్లె, వెన్నె, పిన్నింటి వారి కుటుంబాలకు చెందిన మరో నాలుగు రథాలు ఊరేగింపులో పాల్గొంటాయి.

సందడే సందడి

రెడ్డిపల్లి, శేరిఖండం పంచాయతీల్లో బంగారమ్మ ఉత్సవాలు జరుగుతాయి. రెడ్డిపల్లితో పాటు రామన్నపేట, భద్రయ్యపేట, సుంకర పేట, మర్రి బంద, గంగయ్య గారి కళ్లాలు, రెల్లిపేట గ్రామాల్లోనూ, శేరిఖండంతో పాటు సంగుపేట గ్రామంలోనూ ఈ పండగను నిర్వహిస్తారు. ఈ గ్రామాల్లో 12న తొలేళ్ల ఉత్సవం ఉంటుంది. అమ్మవారి ఘటాలను, 500 రకాల స్వీట్లు, సారెను రామాలయం వద్ద ఏర్పాటు చేసిన సతకం పట్టు వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి ఉంచుతారు. మహిళలు స్వీట్లు, సారెను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లి సమర్పిస్తారు. 13న పుప్పాల, ఉండబట్ల, రెడ్డిపల్లి కుటుంబాల పేరు మీద తయారుచేసిన రథాలను రెడ్డిపల్లిలోని పుప్పాల వీధి, రామాలయం వీధి, ఆర్అండ్ బీ రోడ్డు మీదుగా మూడుసార్లు ఊరేగిస్తారు. ఈ మూడు పంచాయతీల్లో ఉత్సవాల నిర్వహణకు సుమారు రూ.70 లక్షల వరకు ఖర్చవుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతాల ప్రజలు తమ బంధువులు, మిత్రులను ఇప్పటికే పండగకు ఆహ్వానించారు.





రెడ్డిపల్లిలోని బంగారమ్మ విగ్రహం

ఏర్పాట్లు పూర్తి



పాండ్రంగిలో ఉత్సవానికి సిద్ధం చేసిన సిరిమాను

ఇప్పటికే ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పాండ్రంగిలోని జట్లమ్మ, రెడ్డిపల్లిలోని బంగారమ్మ ఆలయాలకు, విగ్రహాలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాలతో పాటు వీధివీధిన లైటింగ్ ఏర్పాటు చేశారు. పాండ్రంగిలో సిరిమానును సిద్ధం చేశారు.



రెడ్డిపల్లిలో ఘటాలు కొలువు దీరడానికి సిద్ధం చేసిన సతకం పట్టు



పాండ్రంగిలో సిరిమాను ఏర్పాటు చేయడానికి సిద్ధం చేసిన రథం

తరాలుగా అదే సంప్రదాయం



పూర్వీకుల నుంచి మా కుటుంబ సభ్యులే సిరిమానుపై ఆశీనులవుతారు. అమ్మవారి మహిమతో నేను ఇదివరకే నాలుగుసార్లు సిరిమానును అధిరోహించాను. ఈసారి కూడా అమ్మవారి ఆశీస్సులతో సిరిమానుపై ఆశీనులవుతా. మంగళవారం జరగబోయే సిరిమాను ఉత్సవానికి ఉత్సవ కమిటీ పెద్దలు ఏర్పాట్లు పూర్తి చేసింది.

పి.నాగరాజు, పూజారి, పాండ్రంగి

ఆరేళ్ల తర్వాత పండగ



రెడ్డిపల్లి, శేరిఖండం పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో 2019 మే నెలలో బంగారమ్మ పండగ జరిగింది. మళ్లీ ఆరేళ్ల తర్వాత ఇప్పుడు ఈ పండగను నిర్వహిస్తున్నారు. ఉమ్మడిగా బంగారమ్మ ఉత్సవం జరుపుకోవడం ఈ రెండు పంచాయతీల పరిధిలోని గ్రామాలకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. పూర్వం నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది.

వి.వెంకట త్రినాథ, శేరిఖండం

పార్టీకి కార్యకర్తలే బలం

- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యాన్ని అభినందిస్తున్న శ్రీనివాసరావు



నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: ఏ పార్టీ మనుగడ అయినా వారు సాధించుకున్న కార్యకర్తల బలంతోనే సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆనందపురం పార్టీ మండల కమిటీ, అనుబంధ కమిటీల ఎన్నిక సమావేశం మండలంలోని గండిగుండం వద్ద పార్టీ జిల్లా కార్యదర్శి, స్థానిక సర్పంచ్ గంట్రెడ్డి శ్రీనివాస్ ఇంటి ఆవరణలో జరిగింది. ఈ సమావేశంలో ఆయన కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీలు సంస్థాగతమైన మార్పులతో బలోపేతం కావడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం బలమైన సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అన్ని విషయాలు తెలుస్తున్నాయన్నారు. రానున్న జగన్ 2.0 ద్వారా పార్టీ ఎలా ఉండబోతుంది, కార్యకర్తలకు ఎలాంటి ప్రాధాన్యత ఉండబోతుందోనన్న విషయాలపై ఇటీవల తమకు దిశానిర్దేశం చేశారన్నారు. ఇకపై ప్రతి కార్యకర్త నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా భావించి పార్టీని బలోపేతం చేయాలన్నారు. మరో 15 రోజుల్లో ఆనందపురంలో నియోజకవర్గ పార్టీ కార్యాలయం ప్రారంభం కాబోతోందన్నారు. దీంతో నిత్యం ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలపై చర్చిస్తామన్నారు.

పార్టీ మండల అధ్యక్షుడిగా సత్యం

పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా బంక సత్యం మరోమారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో అనుబంధ కమిటీలను ఎంపిక చేసి పార్టీ ఆమోదం కోసం పంపించారు. పంచాయతీల వారీగా పదవులు ఆశిస్తున్న వారితో విడివిడిగా మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, బంటుపల్లి మణిశంకరనాయుడు, పాండ్రంగి అప్పారావు, డోల దేవుడు, వైస్ ఎంపీపీలు పాండ్రంగి శ్రీను, బొట్ట అప్పలరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు చందక లక్ష్మి, బోని అప్పలనాయుడు, బావిశెట్టి రాజు, ఎస్. చంద్రమౌళి, పిన్నింటి వెంకటరమణ, షిణగం దామోదరరావు, చెన్నా సత్యం, కోరాడ అప్పలస్వామినాయుడు, ముసలినాయుడు, షిణగం అప్పలరాజు, కలిమి గంగరాజు, పల్ల రమణ, లెంక రాంబాబు, పినిశెట్టి సింహాచలం నాయుడు, కర్రి నాయుడుబాబు, రౌతు వెంకటరావు, బలిరెడ్డి మహేష్, కోరాడ వెంకటరమణరావు, గిరిరాజు, కర్రి నాయుడుబాబు, డోల ఆనంద్, ఇల్లిపల్లి నరసింగరావు, కోన శ్రీను, బంక శ్రీను, కాళ్ల గౌరి, గంటా జగదీశ్వరరావు, ఇల్లపు వెంకటరావు, గీతల దేవుడు, చందక సూరిబాబు, రౌతు శ్రీను, చందక అప్పలస్వామి, బోని సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో మామిడి తోటలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు పద్మనాభం పోలీసులు శనివారం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... రెడ్డిపల్లి గ్రామంలోని బోని బంగారయ్య మామిడి తోటలో శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి వీఆర్ఏ బోని చంద్రరావుకు సమాచారం ఇచ్చారు. వీఆర్ఏ ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుంది. అతడు సుమారు 5.5 అడుగుల ఎత్తు కలిగి, గులాబి రంగు గీతలతో కూడిన నల్ల రంగు హాఫ్ హ్యాండ్స్ షర్టు, తెలుపు చుక్కలు గల నేవీ బ్లూ రంగు నిక్కరు ధరించి ఉన్నాడు. మృతదేహం కాలిపోయి ఉంది. మృతదేహాన్ని భీమిలి మార్చురీలో ఉంచారు. ఈ వ్యక్తి గురించి తెలిసిన వారు 94906 17920, 91770 68006, 08933 223558 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఫ్లైఓవర్‌పై నుంచి పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

తగరపువలస: ఆనందపురం వద్ద మతిస్థిమితం లేని వ్యక్తి ప్రమాదవశాత్తు ఫ్లైఓవర్‌పై నుంచి పడి మృతి చెందాడు. విశాఖ సత్యం జంక్షన్ క్రాంతి నగర్‌కు చెందిన నిద్దాన సత్యనారాయణ అనే వ్యక్తి మతిస్థిమితం లేకపోవడంతో శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. గతంలో కూడా ఇలా వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేవాడు, కానీ ఈసారి రాలేదు. అయితే శనివారం తెల్లవారుజామున ఆనందపురం దగ్గర వేములవలస పాత ఫ్లైఓవర్‌పై నుంచి సత్యనారాయణ పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారి సమాచారంతో కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందాడు. కాగా ఇతని వద్దనున్న ఆధార్ ద్వారా చిరునామా తెలుసుకుని పోలీసులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్స్ హెల్ప్ గ్రూప్ సేవలు అభినందనీయం



మహిళలకు గొడుగులు పంపిణీ చేస్తున్న భీమిలి ఎంపీడీవో హనుమంతరావు

పద్మనాభం: టీచర్స్ హెల్ప్ గ్రూప్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీడీవో ఎస్.హనుమంతరావు అన్నారు. రేవిడిలో జరిగిన గ్రూప్ తొమ్మిదో వసంతోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రి, వైద్య సహాయం, వృద్ధులు, నిరాశ్రయులకు భోజనం అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో భాగంగా నిరుపేద మహిళలు, వితంతువులకు రూ.50 వేల విలువైన చీరలు, గొడుగులు, దుప్పట్లు, చాపలు పంపిణీ చేశారు. వంద మందికి అన్నదానం చేశారు. టీచర్స్ హెల్ప్ గ్రూప్ గౌరవాధ్యక్షుడు కంటుబోతు ముత్యాలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మరగడ రామకృష్ణ, సభ్యుడు మరగడ అప్పారావు, రిటైర్డ్ ఎంపీడీవో సత్య బాపిరాజు, జామి అప్పలకృష్ణ, ఎంవీఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో త్రయోదశి పూజలు

పీఎం పాలెం: త్రయోదశిని పురస్కరించుకుని శనివారం పీఎంపాలెంలోని శైవ క్షేత్రాల వద్ద గల నవగ్రహాలకు భక్తులు అభిషేకాలు నిర్వహించారు. శనీశ్వరుని విగ్రహానికి తైలాభిషేకం చేయగా, మిగతా గ్రహాలకు నవధాన్యాలు నైవేద్యంగా సమర్పించారు.

నేడు శిల్పారామంలో నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామం (జాతర)లో కూచిపూడి, జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందని ఇన్‌చార్జ్ ఏట రమణ తెలిపారు. నటరాజా నాట్యమండలి, శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఉంటుందన్నారు.

బోటు షికారు అందుబాటులోకి వచ్చేనా?



పార్కులోని జమ్మి చెరువు

భీమునిపట్నం : స్థానిక చిన్నబజారు సమీపంలోని జమ్మిచెరువు పార్కులో బోటు షికారు ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ, అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. 2006లో ఏర్పాటు చేసిన ఈ పార్కులో సరైన సదుపాయాలు, లైటింగ్ లేవు. అయితే ఈ చెరువులో ఎండా కాలంలోనూ సమృద్ధిగా నీరు ఉండడంతో బోటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ఇందుకోసం అంచనాలు రూపొందించి పంపినా, అది అమలు కాలేదు. గత ప్రభుత్వంలో పార్కు ఆధునీకరణకు రూ. 82 లక్షలు మంజూరయ్యాయి. మొదటి విడతగా రూ. 40 లక్షలతో లైటింగ్ వంటి కొన్ని సదుపాయాలు కల్పించడంతో పార్కుకు మంచి కళ వచ్చింది. మిగిలిన రూ. 42 లక్షలతో మరిన్ని పనులు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గతంలో అనుకున్న బోటింగ్ సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు భావిస్తున్నారు. ప్రస్తుతం చెరువు చుట్టూ పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి ఉండటంతో వాటిని తొలగిస్తే బోటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. రెండో విడత పనులతో పాటు బోటింగ్ సౌకర్యం కల్పిస్తే సందర్శకులు పెరగడంతో పాటు ఆదాయం కూడా వస్తుంది.

ఈ ఆక్రమణలు కనిపించవా?



కుమ్మరిపాలెం దేవదాయశాఖ భూముల్లో నిర్మాణాలు

తగరపువలస: దేవదాయశాఖ సంగివలస కొత్తమ్మ ఆలయ ఈవో పరిధిలో ఉన్న లంగర్‌ఖానా భూములకు రక్షణ లేకుండా పోయింది. 'సత్రం భూములు పరహస్తం' శీర్షికతో గత నెల 25న సాక్షిలో ప్రచురించిన వార్తకు స్పందించిన దేవదాయశాఖ అధికారులు, 26 లంగర్‌ఖానా భూముల పరిశీలనకు చిల్లపేట, కుమ్మరిపాలెం, నేరెళ్లవలస, కొంకివీధి, చిట్టివలస ప్రాంతాలలో తనిఖీలు చేశారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీధర్, సంగివలస ఈవో డీవీఎస్ సురేష్‌బాబు, స్థానిక సిబ్బంది ఈ పరిశీలనలో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం 'సత్రం భూములు అంగుళం కూడా వదిలిపెట్టం' అంటూ స్టేట్‌మెంట్ ఇచ్చారు. కానీ వారికి తెలియని విషయం ఏమిటంటే, గతంలో ఇక్కడ పనిచేసిన సిబ్బంది నాలుగైదు చోట్ల జరిగిన ఆక్రమణలను ఇన్‌స్పెక్టర్, ఈవో దృష్టికి తీసుకురాలేదు. వాటిలో కుమ్మరిపాలెం, చిల్లపేటలో పలు ఆస్తులు ఉన్నాయి. దేవదాయశాఖ సిబ్బంది అండతో యథేచ్ఛగా నిర్మాణాలు, ఆక్రమణలు జరిగిన చోట గతంలో కొన్నింటిని తొలగించి, మరికొన్నింటిని వదిలివేయడంతో మిగిలినవారు దేవదాయశాఖ చిత్తశుద్ధిపై మండిపడుతున్నారు. కక్ష సాధించినట్లు కొందరి ఆక్రమణలు తొలగించి, మరికొన్నింటిని వదిలివేయడంతో వారిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసు రక్షణతో వచ్చి ఆక్రమణలు తొలగిస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని కోరుతున్నారు.

రక్షణ కల్పించాలంటూ టీడీపీ మహిళా నేత విజ్ఞప్తి

పీఎం పాలెం: తమ నివాసంపైకి కొంతమంది వచ్చి గొడవకు దిగుతున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని జీవీఎంసీ ఆరో వార్డుకు చెందిన టీడీపీ మహిళానేత జహనారా ఆవేదన వ్యక్తం చేసింది. పీఎం పాలెంలోని తన నివాసం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక హౌసింగ్ కాలనీకి సమీపంలో ఇల్లు నిర్మించుకుని గత కొంతకాలంగా కుటుంబంతో సహా నివసిస్తున్నారు. ఇంటికి సంబంధించిన అన్ని పత్రాలు తమ వద్ద ఉన్నప్పటికీ, కొంతమంది వచ్చి ఇల్లు ఖాళీ చేయాలని దౌర్జన్యాలకు, దాడులకు దిగుతున్నారని పేర్కొన్నారు. వారి నుంచి రక్షణ కల్పించాలని పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. కొన్ని రోజులుగా తాము నివసిస్తున్న ఇంటి స్థలం తమదే అంటూ ఒక వ్యక్తి ఇంటికి వచ్చి పలు విధాలుగా వేధిస్తున్నాడని, స్థలానికి సంబంధించి ఎటువంటి పత్రాలు ఆ వ్యక్తి చూపించడం లేదని ఆమె అన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించాలని కోరింది.